క్లుప్తంగా

నవోదయ ఎంట్రన్స్ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు నవోదయ పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం ఏవీహెచ్ శాస్త్రి

యలమంచిలి రూరల్: మండలంలోని జంప పాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం 5వ తరగతి విద్యార్థులకు ఓ దాత సమకూర్చిన జవహర్ నవోదయ ఎంట్రన్స్ పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు ఏవీహెచ్ శాస్త్రి అందజేశారు. విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను సమకూర్చిన విజయలక్ష్మి వాటర్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని నిమ్మదల నాగేశ్వరరావుకు ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

రెండు ఇసుక రీచ్‌ల గుర్తింపు



కైలాసపట్నంలో ఇసుక లభ్యతపై పరిశీలన చేస్తున్న అధికారులు

కోటవురట్ల: మండలంలోని వరాహ నదిలో రెండు ఇసుక రీచ్‌లను గుర్తించినట్టు తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఆయన ఎంపీడీవో కాశీవిశ్వనాథరావుతో కలిసి ఇసుక లభ్యతపై పరిశీలన చేశారు. తహసీల్దారు మాట్లాడుతూ కైలాసపట్నం, గొట్టివాడ ప్రాంతాలలో ఇసుక రీచ్‌లను గుర్తించామని తెలిపారు. ఈ రీచ్‌ల నుంచి అధికారుల ఆమోదంతో ఇసుకను తీసుకునేందుకు అనుమతి ఇస్తామన్నారు. ఇరిగేషన్ పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, ప్రభుత్వ గృహ నిర్మాణాలకు అనుమతి ఇస్తామని తెలిపారు.

గొల్లపేటలో నట్టల నివారణ కార్యక్రమం



గొల్లపేటలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీ నరేష్

కోటవురట్ల: పశు సంవర్ధక శాఖ ద్వారా మేకలు, గొర్రెలకు ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు నట్టల నివారణ మందు వేయనున్నట్టు ఏడీ డాక్టర్ పెట్ల నరేష్ తెలిపారు. గొల్లపేటలో గురువారం నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోటవురట్ల, మాకవరపాలెం మండలాల పరిధిలో 13,718 మేకలు, 16,460 గొర్రెలు లక్ష్యంగా నట్టల నివారణ మందు వేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపేటలో 1,534 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసినట్టు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పల్లె పండగ'



జల్లూరులో పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తదితరులు

కోటవురట్ల: మండలంలోని జల్లూరు, లింగాపురం గ్రామాల్లో గురువారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. జల్లూరులో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ పద్మావతి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, జేఈ వర్మ, టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ప్రభుత్వం చేపడుతున్న పనులు శంకుస్థాపనకే పరిమితం కాకుండా వేగంగా నిర్మాణాలు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి కోరారు. మండలంలో పలు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహించారు. చినగుమ్ములూరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ పలు పనులకు భూమి పూజ చేశారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు సీసీ రోడ్లు, కాలువ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ, మండ పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి 'అన్నదాత సుఖీభవ'

- ఖరీఫ్ ఆఖరి దశకు చేరినా అందని సాయం
- తీవ్ర నిరాశ, నిస్పృహల్లో రైతులు



వరి చేనుకు పురుగు మందు స్ప్రే చేస్తున్న రైతు

కోటవురట్ల: అన్నదాతకు కష్టాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వంలో నిశ్చింతగా వ్యవసాయం చేసుకున్న రైతన్నకు కష్టకాలం వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏదో చేసేస్తుందని ఆశపడ్డ ప్రజలకు చంద్రబాబు తన మార్కు మోసం చూపించారు. సూపర్ సిక్స్‌ని మరిచిపోయేలా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఇప్పుడు రైతు పరిస్థితి త్రిశంకు స్వర్గంలో ఉన్నట్టు ఉంది. అదిగో ఇదిగో అంటున్నా 'అన్నదాత సుఖీభవ'కు మోక్షం కలగలేదు. ఖరీఫ్ సీజను దాదాపు చివరి దశకు చేరుకున్నా అన్నదాత సుఖీభవ మాటే వినిపించడం లేదు. అసలు ఈ పథకం ఉన్నట్టా లేనట్టా?.. ఉంటే డబ్బులు ఎప్పుడు వేస్తారు? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలే. గతంలో రైతు భరోసాగా ఉన్న పథకం పేరును కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవగా మార్చేసింది. ఏటా రైతుల అకౌంట్లలో ఖరీఫ్ సాగుకు ముందుగా పెట్టుబడి సాయంగా రూ.20 వేలు వేస్తామని బ్రహ్మాండమైన హామీ ఇచ్చేసింది. ఇంకే ముంది కూటమి ప్రభుత్వం వస్తే అకౌంట్ డబ్బులతో నిండిపోతుందని అంతా తెగ ఆశపడ్డారు. ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటేసినా ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయింది. వరుసగా ఒక్కొక్క హామీ హుష్‌కాకి అవుతోంది. ఇప్పటికే తల్లికి వందనం, మత్స్యకార భరోసా, అన్నదాత సుఖీభవ నగదు జమ కావలసి ఉండగా.. ఒక్క పథకం కూడా ప్రజలకు చేరలేదు. ఎన్నో ఆశలతో రైతన్నలు ఖరీఫ్‌లో వివిధ పంటలను సాగు చేశారు. ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్న నమ్మకంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం ఎరువులు, పురుగుల మందుల రూపంలో రైతుపై భారం పడుతోంది. సీఎం చంద్రబాబు చేసిన మోసాన్ని జీర్ణించుకోలేక నోరు మెదపలేని స్థితికి రైతులు చేరుకున్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాలానుగుణంగా చేసిన సాయాన్ని గుర్తుకు తెచ్చుకుని చంద్రబాబు మాటలకు మరోసారి మోసపోయామని మదనపడుతున్నారు.

రైతన్నకు వెన్నుదన్నుగా ఉన్న జగనన్న

గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు. కుటుంబ పెద్దలా సమయానికి ఆదుకునేవారు. ప్రతి సంవత్సరం పెట్టుబడి సాయంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా పథకం ద్వారా రైతు అకౌంట్‌లో నేరుగా రూ.13,500 జమ చేసేవారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో విత్తనాలను అందించడంతో పాటు ఎరువులు కూడా సరఫరా చేసేవారు. రైతు భరోసా పథకం ద్వారా మండలంలోని 10,772 మంది రైతులకు ఏటా రూ.14,54,22,000 నగదు జమ అయ్యేది. గత ఏడాది ఖరీఫ్‌లో 14,824 ఎకరాలలో, రబీ సీజనులో 1,033 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15,342 ఎకరాలలో వివిధ పంటలను సాగు చేశారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టగా నేటికీ అన్నదాత సుఖీభవ నగదు జమ కాలేదు.

పేరు మార్చారు మోసం చేశారు..



గతంలో ఉన్న రైతు భరోసా పథకాన్ని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చింది. ఏటా పెట్టుబడి సాయంగా రూ.20 వేలు వేస్తామని హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజను చివరి దశకు చేరింది. ఇంకా అన్నదాత సుఖీభవ డబ్బులు వేయలేదు. పథకం పేరు మార్చి మమ్మల్ని నిలువునా మోసం చేశారు.

– గొల్లు జోగినాయుడు, రైతు, కె.వెంకటాపురం

డబ్బులు వేస్తారని ఎదురుచూస్తున్నాం..



అన్నదాత సుఖీభవ డబ్బుల కోసం రైతులంతా ఎదురు చూస్తున్నాం. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం రూ.20 వేలు వేస్తారన్న నమ్మకంతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టాం. ఎరువులు, పురుగు మందులు కొనేందుకు చాలా భారంగా ఉంది. కొత్తగా ఎవరూ అప్పులు ఇవ్వడం లేదు. తొందరగా డబ్బులు చేస్తారని ఆశపడుతున్నాం.

– లవుడు సత్యనారాయణ, రైతు, కె.వెంకటాపురం

ఆదాయ, వ్యయాలపై అవగాహన అవసరం

వార్డు సభ్యులకు రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభం



నక్కపల్లిలో వర్క్‌షాపునకు హాజరైన వార్డు సభ్యులు



మునగపాక కార్యాలయంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ



రాంబిల్లిలో శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ సన్యాసిరాజు

నక్కపల్లి: పంచాయతీల ఆదాయ, వ్యయాలపై ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అవగాహన అవసరమని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. గురువారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ నిధుల వినియోగం, రాబడి, ఖర్చులు, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలపై ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు జరిగే రెండు రోజుల వర్క్‌షాపు ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలకు ప్రభుత్వంతో పాటు, ప్రజలు చెల్లించే పన్నుల రూపంలోనే ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ ఆదాయాన్ని ఏవిధంగా ఖర్చు చేయాలి, ఏయే పనులకు వినియోగించాలి, ఎంత శాతం ఖర్చు చేయాలనే దానిపై పంచాయతీరాజ్ చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. గ్రామంలో కనీస అవసరాల కోసం ఖర్చు చేసే క్రమంలో నిబంధనలు పాటించాలన్నారు. పంచాయతీకి సమకూరే ఆదాయంలో రోడ్లు, కాలువలు, పారిశుధ్య కార్యక్రమాలు, వీధి లైట్ల నిర్వహణ కోసం వెచ్చించాల్సి ఉంటుందన్నారు. క్రమం తప్పకుండా ప్రతి మూడు నెలలకొకసారి సర్వసభ్య సమావేశాలు నిర్వహించి, జమా ఖర్చుల వివరాలు తెలియజేయాలన్నారు. రికార్డుల నిర్వహణ, ఆదాయ వ్యయాలను తెలుసుకునే అధికారం ప్రతి వార్డు సభ్యుడికి ఉందన్నారు. కోరం లేకుండా సమావేశాలు నిర్వహించడం, పాలకవర్గం ఆమోదం లేకుండా అభివృద్ధి పనులు చేపట్టడం, నిధులను ఖర్చు చేయడం కుదరదన్నారు. సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడానికి కూడా వీల్లేదన్నారు. పెద్ద కంపెనీలు సీఎస్ఆర్ నిధులను కేటాయిస్తున్నాయని, వాటి ద్వారా కూడా స్థానిక సంస్థల్లో ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ యాక్షన్ ప్లాన్ ప్రకారం ఆయా ఏరియాల్లో నిధులు కేటాయింపులు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, ఈశ్వరరావు, సీనియర్ కార్యదర్శులు బీఏబీఎల్ మూర్తి, సత్యనారాయణ, రాజశేఖర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిపై దృష్టి సారించాలి

మునగపాక: గ్రామాలాభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ కోరారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు జరిగిన రెండు రోజుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి మాట్లాడుతూ వార్డు సభ్యుల విధులు, హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈవోఆర్డీ సోమరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

రాంబిల్లి(యలమంచిలి): గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని రాంబిల్లి మండల ఈవోపీఆర్డీ సన్యాసిరాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు జరిగిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. పలు పథకాలపై అవగాహన కల్పించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

రాంబిల్లి(యలమంచిలి): విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం రాంబిల్లి మండలంలో కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు, మర్రిపాలెం, మురకాడ, రజాల, కుమ్మరాపల్లి, కొట్టుబోలు, దిమిలి, నారాయణపురం, మామిడివాడ, గోకివాడ, మూలజంప, మూలకొత్తూరు, పంచదార్ల, ధారపాలెం, భోగాపురం, అప్పారాయుడుపాలెం, హరిపురం, వెంకటాపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

యలమంచిలి రూరల్: యలమంచిలి, ఎస్.రాయవరం మండలాల్లో పురుషోత్తపురం, దార్లపూడి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు సహా పలు మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం 8 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. పులపర్తి, లక్కవరం, విశాఖ బయో మెరైన్ పరిశ్రమ, ఏటికొప్పాక, ములకలాపల్లి, కొత్తలి, పేరంటాళ్లపాలెం, మన్యంపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. అవకాశం మేరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉదయం 5 నుంచి ఉదయం 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఎస్.రాయవరం: మండలంలో బంగారమ్మపాలెం, గుడివాడ, గుర్రాజుపేట పరిశ్రమలకు, చినఉప్పలం చెరువులకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా ఆయా గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

కల్వర్టు స్థానంలో మినీ బ్రిడ్జి నిర్మించాలి



దెబ్బతిన్న కల్వర్టు వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు,రైతులు

యలమంచిలి రూరల్: శిథిలమై ప్రమాదకరంగా మారిన రామారాయుడుపాలెం రహదారిలో కల్వర్టు వద్ద మినీ వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం రైతులు నిరసన తెలిపారు. యలమంచిలి నుంచి రామారాయుడుపాలెం, తురంగలపాలెం వెళ్లే రహదారిలో కల్వర్టు శిథిలమైపోయింది. దీంతో దీనిపై నుంచి రోజుల తరబడి వర్షపు నీరు ప్రవహిస్తోంది. నాచుపట్టి ఉండడంతో పొలం పనులకు నడిచి వెళ్లే రైతులు జారిపడుతున్నారని, గతంలో ఓ రైతు జారిపడి మృతి చెందాడని నిరసనలో పాల్గొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందుల దృష్ట్యా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టు స్థానంలో మినీ వంతెన నిర్మించాలని సీఐటీయూ మండల **కార్యదర్శి చింతకాయల శివాజీ కోరారు.**

ఘనంగా వాల్మీకి జయంతి



పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో వాల్మీకి మహర్షి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వాల్మీకి చిత్ర పటం వద్ద అంజలి ఘటిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం నునపర్తి శివారు నడింపల్లిలో గురువారం ఆదికవి వాల్మీకి జయంతి ఘనంగా జరిగింది. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ యలమంచిలి సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు మాట్లాడుతూ వాల్మీకి జీవితం ఆదర్శం కావాలన్నారు. సృష్టి ఉన్నంత కాలం వాల్మీకిని గుర్తించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ధార్మిక కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటేష్, కొల్లి నాగమణి, యాండ్ర సూరిబాబు, శ్రీను, మణి, తదితరులు పాల్గొన్నారు.

పి.ధర్మవరం పాఠశాలలో..

ఎస్.రాయవరం: వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో ఆయన చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి జీవిత సారాంశం విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గారా ప్రకాష్, శోభ, అరుణ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



మడకపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు



చాటమెట్టలో అర్జీలు స్వీకరిస్తున్న రాంబిల్లి మండల తహసీల్దార్ శ్రీనివాసరావు



జంపపాలెంలో ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న తహసీల్దార్ వరహాలు,అధికారులు

మునగపాక: భూముల రీసర్వేపై జరుగుతున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆది మహేశ్వరరావు కోరారు. మండలంలోని మడకపాలెంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన రీ–సర్వేలో తేడాలున్నట్లయితే వాటిని సవరించే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా తేడాలుంటే వాటిని పరిష్కరించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. రైతులు గ్రామసభలకు హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. రీ–సర్వే డీటీ పడాల్, పెద్దలు చిరంజీవి, బుజ్జి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): మండలంలోని రాంబిల్లి సమీప చాటమెట్ట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రీసర్వేలో లోపాలపై పలువురు రైతులు అర్జీలు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సదస్సులో అధికారులు అందరూ అందుబాటులో ఉండి, సేవలందిస్తారని, అర్జీదారులకు ఇది ఒక సువర్ణావకాశమని చెప్పారు.

జంపపాలెంలో 40 అర్జీల స్వీకరణ

యలమంచిలి రూరల్: గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వేకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం మండలంలోని జంపపాలెంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సభలో ప్రజల నుంచి 40 అర్జీలు స్వీకరించినట్టు తహసీల్దార్ వరహాలు తెలిపారు. వీటిలో ఎక్కువ దరఖాస్తులు రీసర్వేకు ముందు తమకు ఎక్కువ భూమి ఉండేదని, రీ సర్వేలో తమ భూమి విస్తీర్ణం తగ్గిపోయిందని అర్జీల్లో పేర్కొన్నారని ఆయన చెప్పారు. రీ సర్వేకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా రెవెన్యూ సభల్లో అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం శివారు గొల్లగుంట, సోమలింగపాలెం గ్రామాల్లో రెవెన్యూ సభలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే సమస్యల పరిష్కారానికి కృషి

నక్కపల్లి: గతంలో భూముల రీసర్వే సమయంలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. గురువారం ఆయన రమణయ్యపేటలో గ్రామసభ నిర్వహించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. సర్వే పూర్తయిన నంబర్లలో విస్తీర్ణంలో తేడా, పేర్లు మార్పులు చేర్పులు, తదితర సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ అన్నాజీరావు, సర్వే సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

సుంకపూరులో 44 దరఖాస్తులు

కోటవురట్ల: రెవెన్యూ పరమైన సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తామని తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. సుంకపూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై రీసర్వే కోసం 44 దరఖాస్తులు వచ్చాయన్నారు. సాధ్యమైనంత తొందరగా రీ సర్వే చేయించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

కుండపోత

- ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- స్తంభించిన జన జీవనం



తిమ్మరాజుపేటలో నిలిచిపోయిన వర్షపునీరు



మునగపాక మండల సముదాయానికి వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి కుండపోతగా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు, పంట కాలువలు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మైనర్ శారదా, శారదా నదిలోకి పైనుంచి నీరు అధికంగా చేరడంతో పరవళ్లు తొక్కుతున్నాయి.

శారదానది దిగువన ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. రాంబిల్లి మండలం అప్పారాయుడుపాలెం, భోగాపురం గ్రామాల మధ్య ఉన్న దొంగగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మండలంలో పలు గ్రామాల్లో కాలువలు పొంగిపొర్లాయి. గురువారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించిపోయింది. పలుచోట్ల వరి పంట మునిగిపోయింది.

మునగపాకలో భారీ వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి దపదపాలుగా వర్షం కురియడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తిమ్మరాజుపేటలో భారీ వర్షం కురియడంతో వర్షపునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. మునగపాక బీసీ కాలనీల్లో పలు చోట్ల వర్షపునీరు రహదారులపై నిలిచిపోయింది. మండల సముదాయానికి వెళ్లే మార్గంలో వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించే ఉద్యోగులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ వర్షం వరి పంటకు మేలు చేకూరుస్తుందని అధికారులు తెలిపారు.

ఘనంగా గంగాలమ్మతల్లి నెల పండగ



మూలపేటలో సారె ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక: మూలపేటలో గురువారం గంగాలమ్మ తల్లి అమ్మవారి నెల పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అమ్మవారికి మొక్కలు చెల్లించుకున్నారు. గ్రామంలో రాత్రి ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మహిళలు పలు రకాల పిండి వంటలతో తయారు చేసిన సారె ఊరేగింపు ఉత్సాహంగా సాగింది.

ఆవు పాల సేకరణ ధర తగ్గింపుపై చర్చ

మునగపాక: ఆవు పాల సేకరణ ధరను తగ్గించడంతో రైతుల నుంచి ఎదురైన చేదు అనుభవాలను విశాఖ డెయిరీ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లాలని గురువారం మునగపాక తులసీ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. మండలంలోని పలు పాల సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు గురువారం ప్రత్యేక సమావేశమయ్యారు. విశాఖ డెయిరీ ఇటీవల ఆవు పాల సేకరణ ధరను లీటరు ఒక్కంటికి రూ.4 వంతున తగ్గించేయడంతో పలువురు రైతులు సంబంధిత సొసైటీల వద్ద నిరసన తెలిపారు. ధరను తగ్గిస్తే పాల కేంద్రాలకు పాలు పోసేది లేదంటూ రైతులు తెగేసి చెప్పడంతో ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల సమస్యను డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మునగపాక పాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల సంజీవరావు, పెంటకోట సత్యనారాయణ, సబ్బి శ్రీనివాసరావు, బొడ్డేడ గంగాధర్, గణేష్, నాగేశ్వరరావు, అప్పారావు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.